బీజేపీ పటిష్టతకు కృషిచేస్తా



సతీష్‌ సింగ్‌ను సన్మానిస్తున్న నాయకులు

చాదర్‌ఘాట్‌: ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌ బీజేపీ అధ్యక్షుడిగా సతీష్‌ సింగ్‌ నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం ఆయన ఓల్డ్‌మలక్‌పేటలోని పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో పార్టీ పటిష్టతకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో చౌకి రవికుమార్‌, రాంకోటేశ్వరరావు, చౌకి రాజు, రాజారావు గౌడ్‌, రాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

చెక్కుల అందజేత



చెక్కు అందజేస్తున్న మధుయాష్కి గౌడ్‌

లింగోజీగూడ: సీఎం రిలీఫ్‌ ఫండ్‌ పేదల ఆరోగ్యానికి భరోసా అని, ఎంతో మంది పేదలకు ఆర్థికంగా లబ్ధి జరిగిందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్‌ మధుయాష్కిగౌడ్‌ తెలిపారు. పలువురికి మంజూరైన సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కులను శనివారం ఆయన వనస్థలిపురం డివిజన్‌ కాంగ్రెస్‌ అధ్యక్షులు కుట్ల నరసింహ, శ్రీనివాస్‌తో కలిసి అందజేశారు.

ఆధ్యాత్మికతతో శాంతి, సోదరభావం



అరుణ రవీందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రతినిధులు

సైదాబాద్‌: ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా సమాజంలో శాంతి, సోదరభావం పెంపొందుతాయని సైదాబాద్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. ఎస్‌బీహెచ్‌ సీ కాలనీ విఘ్నేశ్వర కమ్యూనిటీ హాల్‌లో భజనానంద సమూహ హైదరాబాద్‌ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన భజన, ఆధ్యాత్మిక కార్యక్రమంలో కార్పొరేటర్‌ పాల్గొని మాట్లాడారు. సామూహికంగా నిర్వహించే ఇలాంటి కార్యక్రమాల ద్వారా అందరిలో ఐక్యత పెరుగుతుందన్నారు. అనంతరం సమూహ ప్రతినిధులు కార్పొరేటర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో జయశ్రీ, రోహిణి జోషి, లక్ష్మీబాయి జోషి, చేతాలి, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



చంపాపేట: చంపాపేట డివిజన్‌ కర్మన్‌ఘాట్‌ ధ్యానాంజనేయ స్వామివారిని శనివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నారాయణరెడ్డి దంపతులను వేద మంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ పాలకమండలి చైర్మన్‌ నల్లా రఘుమారెడ్డి, నాయకులు బట్టు కిషన్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, కిరణ్‌ గుప్తా పాల్గొన్నారు.

ప్రజాసేవ చేయడం ఇష్టం



ఎల్‌బీనగర్‌: ప్రజాసేవ, సమాజసేవ చేయడం తనకెంతో ఇష్టమని బీఎన్‌రెడ్డినగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శనివారం మధుర రెసిడెన్స్‌లో నిర్వహించిన వనస్థలి క్రాంతిక్లబ్‌ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భవిష్యత్‌లో లయన్స్‌ క్లబ్‌ నిర్వహించే అన్ని సేవా కార్యక్రమాల్లో పాల్గొంటానన్నారు. అనంతరం నిరుపేద పిల్లల కోసం రూ.10 వేలు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌ క్లబ్‌ సభ్యులు వాసుదేవరావు, సాధు కృష్ణకిషోర్‌, మహేష్‌కుమార్‌ పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్‌ కార్డులు ఇవ్వాలి

ముషీరాబాద్‌: అర్హులందరికీ రేషన్‌ కార్డులు ఇవ్వాలని మహిళా సంఘాల ప్రతినిధులు శనివారం ఓ ప్రకటనలో డిమాండ్‌ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 12 లక్షల కుటుంబాలు రేషన్‌ కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటే కేవలం 6 లక్షల కుటుంబాలకే రేషన్‌ కార్డులు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం పేదలను మోసం చేయడమేనని పీవోడబ్ల్యూయూ రాష్ట్ర అధ్యక్షురాలు జి.అనసూయ, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి.మహేష్‌, పీవైఎల్‌ రాష్ట్ర అధ్యక్షుడు సాగర్‌ మండిపడ్డారు.

కాలనీల్లోనూ అక్రమ పార్కింగ్‌!

• రోడ్లకు ఇరువైపులా వాహనాల నిలిపివేత • ప్రశ్నిస్తే గొడవలే.. • ట్రాఫిక్‌ పోలీసులు దృష్టి సారించాలని కాలనీవాసుల విజ్ఞప్తి



సైదాబాద్‌ కాలనీలో ఇష్టారాజ్యంగా పార్కింగ్‌

జయానగర్‌లో ఇరువైపులా ఇలా..

సైదాబాద్‌: ప్రధాన రహదారులపై కొన్నిసార్లు సాఫీగా, మరికొన్ని సార్లు ట్రాఫిక్‌జామ్‌ను ఛేదించుకొని వచ్చే వాహనదారులు తాము చేరుకోవాల్సిన కాలనీల్లోకి వచ్చే సరికి బండి ముందుకు కదల్లేని దుస్థితి నెలకొంటోంది. కాలనీల్లోని అంతర్గత రహదారులకు ఇరువైపులా వాహనాలను ఇష్టారాజ్యంగా నిలుపుతుండటమే అందుకు ప్రధాన కారణం. కాలనీల్లోని రహదారులు సాధారణంగానే చిన్నవిగా ఉంటాయి. ఇక రహదారికి ఇరువైపులా పలువురు తమ ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లను పార్కింగ్‌ చేస్తుండటంతో నానా తంటాలు పడాల్సి వస్తోంది. ప్రధాన రహదారులపైనే కాకుండా ట్రాఫిక్‌ పోలీసులు కాలనీల్లోని అంతర్గత రహదారులపై చేస్తున్న అక్రమ పార్కింగ్‌పై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇరుకు దారుల్లో ఇరువైపులా..

సైదాబాద్‌, ఐఎస్‌సదన్‌ డివిజన్ల పరిధిలోని పలు కాలనీల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంటుంది. సైదాబాద్‌ హౌసింగ్‌ బోర్డ్‌ కాలనీ, జయానగర్‌, సింగరేణి ఆఫీసర్స్‌ కాలనీ, ఇంద్రప్రస్థ కాలనీ తదితర కాలనీల్లో అక్రమ పార్కింగ్‌తో వాహనాలు నడపలేక ఇబ్బందులు పడటం నిత్యకృత్యమవుతుంది. కాలనీల్లోని ఇరుకు దారులకు ఇరువైపులా పలు దుకాణాల వద్ద కొందరు తమ వాహనాలను అడ్డదిడ్డంగా నిలుపుతున్నారు. దాంతో అటుగా వచ్చే వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. వాహనాలు రహదారులకు అడ్డంగా తీయమని అడిగితే కొందరు ఏకంగా గొడవలకు దిగుతున్నారు. ఉద్యోగాలు, వ్యాపారాలు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే తొందరలో ఉండే తాము ఈ గొడవలతో మానసిక ప్రశాంతత కోల్పోతున్నామని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ట్రాఫిక్‌ పోలీసులు దృష్టి సారిస్తేనే..

కాలనీల రహదారులపై ట్రాఫిక్‌ ఇబ్బందులకు కారణమవుతున్న వారిపై ట్రాఫిక్‌ పోలీసులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ట్రాఫిక్‌ పోలీసులు ప్రధాన రహదారులపైనే పూర్తి దృష్టి పెట్టకుండా అప్పుడప్పుడైనా కాలనీల్లోని రహదారులపై పెట్రోలింగ్‌ నిర్వహించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ఆపరేషన్‌ రోప్‌ పేరుతో ట్రాఫిక్‌ పోలీసులు రహదారులకు ఇరువైపులా అక్రమ వ్యాపారాలను అరికడుతున్న తరహా కాలనీ రహదారులపై అక్రమ పార్కింగ్‌ను నివారించాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

కాలనీ రహదారులపై ట్రాఫిక్‌ ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకుంటాం. కాలనీల్లోని దుకాణాల వారు తమ షాపులకు వచ్చే వారికి వాహనాలు క్రమ పద్ధతిలో పార్కింగ్‌ చేయించేలా చొరవ తీసుకోవాలి. ఫిర్యాదు వచ్చిన కాలనీలకు సిబ్బందిని పంపి అక్రమ పార్కింగ్‌ చేసే వారి వాహనాలకు జరిమానాలు విధిస్తాం.

– నర్సింహానాయక్‌, సంతోష్‌నగర్‌ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌

ఐఎస్‌సదన్‌లో ‘ట్రిపుల్‌ ఆర్‌’ కేంద్రం ఏర్పాటు



ట్రిపుల్‌ ఆర్‌ కేంద్రాన్ని ప్రారంభించిన శ్వేతామధుకర్‌రెడ్డి

సైదాబాద్‌: మన ఇంట్లో మనకు ఉపయోగపడని ఎన్నో వస్తువులు మరెందరికో అవసరం కావొచ్చని ఐఎస్‌సదన్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి అన్నారు. పర్యావరణ హితమే లక్ష్యంగా స్వచ్ఛ సర్వేక్షణ్‌ కార్యక్రమంలో భాగంగా శనివారం డివిజన్‌ పరిధిలోని లక్ష్మీనగర్‌ కాలనీ పార్కులో జీహెచ్‌ఎంసీ అధికారులు, శానిటేషన్‌ సిబ్బందితో కలిసి ఆమె ట్రిపుల్‌ ఆర్‌ (రెడ్యూస్‌, రీయూజ్‌, రీ సైకిల్‌) కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. కాలనీలవాసులు తమ ఇళ్లలో నిరుపయోగంగా ఉన్న కుర్చీలు, టేబుళ్లు, ప్లాస్టిక్‌ డబ్బాలు, పుస్తకాలు, దుస్తులు తదితర వస్తువులను ఈ కేంద్రంలో అందజేస్తే వాటిని జీహెచ్‌ఎంసీ సిబ్బంది అవసరమైన వారిని గుర్తించి పంపిణీ చేస్తారన్నారు. ఇళ్లలో పనికిరాని వస్తువులను రహదారులు, నాలాలు, ఎక్కడ పడితే అక్కడ పడేస్తే పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయని పాత వస్తువులను ఈ కేంద్రంలో ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చార్మినార్‌ జోన్‌ శానిటేషన్‌ డీసీ శంకర్‌సింగ్‌, డీఈ వెంకటరాజు, ఎస్‌సీలు అర్జున్‌, ఫక్రుద్దీన్‌, యాదయ్య, కృష్ణ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



చింటూరెడ్డికి ఆర్థిక సహాయం అందజేస్తున్న సహారా ఎస్టేట్స్‌ కాలనీ రెడ్డి సంఘం సభ్యులు

మన్సూరాబాద్‌: ఈ ఏడాది మార్చి 28 నుంచి 30 వరకు కాంబోడియా దేశంలో జరగనున్న ఫస్ట్‌ ఏషియన్‌ పారా త్రోబాల్‌ చాంపియన్‌షిప్‌ పోటీలకు భారత్‌ జట్టుకు ప్రాతినిధ్యం వహించేందుకు దివ్యాంగ క్రీడాకారుడు చింటూరెడ్డి ఎంపికయ్యాడు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న చింటూరెడ్డికి సహారా ఎస్టేట్స్‌ కాలనీ రెడ్డి సంఘం శనివారం రూ.21 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు మల్లు రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వాలు జోక్యం చేసుకుని పారా క్రీడలకు నిధులు కేటాయించాలని కోరారు. అనంతరం చింటూరెడ్డిని రెడ్డి సంఘం సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు బల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పేరువాల జగత్‌రెడ్డి, కోశాధికారి మారెడ్డి రామకృష్ణారెడ్డి, లీగల్‌ అడ్వయిజర్‌ రాఘవరెడ్డి, గంగదాసు కృష్ణారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సోమిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులను పర్మనెంట్‌ చేయాలి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఆలేటి ఎల్లయ్య

హస్తినాపురం: జీహెచ్‌ఎంసీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను పర్మనెంట్‌ చేయాలని రంగారెడ్డి జిల్లా ఎంప్లాయిస్‌ యూనియన్‌ అధ్యక్షులు ఆలేటి ఎల్లయ్య డిమాండ్‌ చేశారు. ఈ నెల 22న జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం హస్తినాపురం చౌరస్తాలో జీహెచ్‌ఎంసీ కార్మికులతో కలిసి ధర్నాకు సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ప్రకటించి రెండో పీఆర్‌సీని అమలు చేయాలన్నారు. బయోమెట్రిక్‌ హాజరు పట్టికలో జరుగుతున్న అవకతవకలను అరికట్టాలని అన్నారు. జీహెచ్‌ఎంసీ కాంట్రాక్టు అవుట్‌ సోర్సింగ్‌ సిబ్బందిని హైకోర్టు తీర్పు ప్రకారం పర్మనెంట్‌ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. జీహెచ్‌ఎంసీ సూపర్‌వైజర్లకు రూ.35 వేల వేతనాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీను, భాగ్యలక్ష్మీ, రేణుక, ముత్తమ్మ, చంద్రమ్మ, ముత్యాలమ్మ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్‌: సరూర్‌నగర్‌, వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరలు.. కిలో టమోటా రూ.11, వంకాయ రూ.28, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.45, బీరకాయ రూ.38, కాలిఫ్లవర్‌ రూ.18, క్యాబేజీ రూ.13, క్యారెట్‌ రూ.32, దొండ రూ.45, ఆలుగడ్డ రూ.25, ఉల్లిగడ్డ రూ.32, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.18, సొరకాయ రూ11, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.45, చామగడ్డ రూ.41, మునగ రూ.85, చిలుకడ దుంప రూ.63, బీట్‌రూట్‌ రూ.27, కీర రూ.35, బీన్స్‌ రూ.45, క్యాప్సికమ్‌ రూ.50. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

సన్మానం



మన్సూరాబాద్‌: భరత్‌నగర్‌కాలనీ ఫేజ్‌–1, 2, రాజీవ్‌గాంధీనగర్‌, ఎన్టీఆర్‌నగర్‌ వడ్డెర సంఘం నూతన అధ్యక్షులుగా నియమితులైన శివరాత్రి అశోక్‌, ఉపాధ్యక్షులు మాదరం ఎల్లయ్య, కమిటీ సభ్యులు లింగయ్య, సంతోష్‌, వెంకన్న, రవి యాదగిరిని బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నేత మామిడి రాంచందర్‌ శనివారం ఎల్‌బీనగర్‌లో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వినోద్‌, వీరయ్య, రాజు, అంజయ్య, బాలరాజు పాల్గొన్నారు.

మాదిగ విద్యార్థి యువ గర్జన సభను విజయవంతం చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న సంఘం నాయకులు

నాగోలు: ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్‌ కాలేజీ ఆవరణంలో డాక్టర్‌ పిడమర్తి రవి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2న జరిగే మాదిగ విద్యార్థి యువగర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని మాదిగ జేఏసీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నక్క మహేష్‌, ఎల్‌బీనగర్‌ ఎస్సీ సెల్‌ మాజీ చైర్మన్‌ జోగు రాములు పిలుపునిచ్చారు. శనివారం ఎల్‌బీనగర్‌లో మాదిగ విద్యార్థి యువగర్జన బహిరంగ సభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేసిన అనంతరం వారు మాట్లాడారు. మాదిగలకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోనే న్యాయం జరుగుతుందన్నారు. మంత్రివర్గ ఉప సంఘంతో ఎస్సీ వర్గీకరణపై ఒక కమిటీ వేశారని లోతైన సమాచారం కోసం ఏకసభ్య కమిషన్‌ వేశారన్నారు. ఈ కార్యక్రమంలో నక్క సుధీర్‌, భావండ్లపల్లి నరేష్‌, ఏటవల్లి హరినాథ్‌, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న హ్యాండ్లూమ్‌, హ్యాండీక్రాఫ్ట్‌ మేళా



కొనుగోలుదారుల సందడి

వనస్థలిపురం: వనస్థలిపురంలోని హుడా కమ్యూనిటీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆల్‌ ఇండియా హ్యాండ్లూమ్‌, హ్యాండీక్రాఫ్ట్‌ మేళా (ఎగ్జిబిషన్‌ అండ్‌ సేల్‌) ఆకట్టుకుంటోంది. మేళాలో కొలువైన దుస్తులు, ఇతర సామగ్రి కొనుగోలుకు వనస్థలిపురం, పరిసర కాలనీల ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. మేళాలో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్‌, డిజైనర్‌, కాంతావర్క్‌, హ్యాండ్‌ బ్లాక్‌, ప్రింటెడ్‌, లినెన్‌, కలంకారీ, బెంగాల్‌ కాటన్‌, లక్నో చికాన్‌, బనారస్‌ చీరలు, లేడీస్‌ ఫ్యాన్సీ టాప్స్‌, డిజైనర్‌ బ్లౌజెస్‌, ఖాదీ మెటీరియల్‌, వన్‌గ్రామ్‌ గోల్డ్‌ జ్యూవెలరీ, జైపూర్‌ బెడ్‌ షీట్స్‌, కొండపల్లి బొమ్మలు, బ్యాగులు, చెప్పులు తదితర ఉత్పత్తులు తగ్గింపు ధరలకు లభిస్తాయని నిర్వాహకులు అక్బర్‌ అలీ తెలిపారు. ఈ అవకాశం రెండు రోజులు మాత్రమే ఉంటుందని ఆయన తెలిపారు.

సంస్కృతం అన్ని భాషలకు జనని



మాట్లాడుతున్న మాధవానంద సరస్వతీ స్వామి

మలక్‌పేట: మూసారంబాగ్‌ అరోరా పోస్ట్‌ గ్రాడ్యుయేట్‌ కళాశాలలో శనివారం తెలంగాణ రాష్ట్ర సంస్కృత భారతి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మాధవనంద సరస్వతీ స్వామి మాట్లాడారు. సంస్కృతం అన్ని భాషలకు జనని అని, భారతీయులందరూ సంస్కృత భాషను నేర్చుకోవాలన్నారు. సామన్య జనులకు సంస్కృత భాషతో పరిచయం చేసేందుకు వస్తు ప్రదర్శనను ఏర్పాటు చేశారని తెలిపారు. తెలంగాణ సంస్కృత భారతి అధ్యక్షులు నరేంద్ర కాప్రే మాట్లాడుతూ.. సమ్మేళనం యొక్క విశిష్టత వివరించి, సంస్కృత సంభాషణ ప్రచారం గత 44 సంవత్సరాలుగా జరుగుతుందన్నారు. అమెరికా సంస్కృత భారతి అధ్యక్షులు నటేశ జానకీరామ్‌ మాట్లాడుతూ.. అమెరికాలో సంస్కృత భాష ప్రచారంపై తీసుకుంటున్న శద్ధ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ మూర్తి, ప్రొ. నీలకంఠం, దత్తాత్రేయ చిలుకమర్రి లక్ష్మీనరసింహాచార్యులు పాల్గొన్నారు.

సాగు భూములకే రైతు భరోసా

తహసీల్దార్‌ సైదులు



మహేశ్వరం: సాగుకు యోగ్యత ఉన్న భూములకే రైతు భరోసా పథకం వర్తిస్తుందని తహసీల్దార్‌ సైదులు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని సుభాన్‌పూర్‌, నాగిరెడ్డిపల్లి, నాగారం, గంగారం, శ్రీనగర్‌ గ్రామాల్లో రైతు భరోసా పథకానికి సంబంధించిన సాగుకు యోగ్యత ఉన్న, యోగ్యత లేని భూములు, రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాగుకు యోగ్యత కలిగిన భూములకు ప్రభుత్వం రైతు భరోసా వస్తుందన్నారు. సాగుకు యోగ్యత లేని భూములకు రైతు భరోసా దక్కదన్నారు. ప్రధానంగా రాళ్లు, రప్పలు, గుట్టలు, రోడ్ల నిర్మాణంలో కోల్పోయిన భూములు, మైనింగ్‌ చేస్తున్న భూములు, నాలా కన్వర్షన్‌ అయిన భూములు, రియల్‌ ఎస్టేట్‌ వెంచర్లు చేసిన భూములు, పరిశ్రమలకు తీసుకున్న భూములు, రైతుల నుంచి ప్రభుత్వం సేకరించిన భూములు, చెరువులు, కుంటలలో ఉన్న భూములకు రైతు భరోసా వర్తించదన్నారు. సాగు యోగ్యతలేని భూములను గుర్తించేందుకు రెవెన్యూ, వ్యవసాయ శాఖ, పంచాయతీరాజ్‌, ఇతర శాఖల అధికారులతో ఫీల్డ్‌ సర్వే నిర్వహించి రైతు భరోసా పథకం నుంచి తొలగిస్తున్నామని తెలిపారు. అంతకుముందు గ్రామాల్లో పలు భూములు, రికార్డులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ స్వర్ణకుమారి, పావని, సీనియర్‌ అసిస్టెంట్‌ ప్రేమ్‌కుమార్‌, వ్యవసాయ శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు పండుగ సాయన్న విగ్రహావిష్కరణ

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్‌ పరిధి చందన చెరువు కట్టపై ఆదివారం పండుగ సాయన్న విగ్రహావిష్కరణ చేయనున్నట్లు బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు చింతల రాఘవేందర్‌ ముదిరాజ్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, చేవెళ్ల, మల్కాజిగిరి ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్‌, కాంగ్రెస్‌ నాయకులు నీలం మధు, కాసాని జ్ఞానేశ్వర్‌లు ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. ముదిరాజ్‌ మహాసభ ప్రతినిధులంతా కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.



రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయిస్తున్న రమేష్‌

రోడ్డు భద్రత అందని బాధ్యత

నాగోలు: రోడ్డు భద్రత ప్రతీ పౌరుడి బాధ్యత అని రవాణా శాఖ జాయింట్‌ కమిషనర్‌ రమేష్‌ పేర్కొన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా నాగోలు ఇన్‌చార్జ్‌ ఆర్టీఓ అమర్నాథ్‌ ఆధ్వర్యంలో శనివారం డ్రైవర్లకు నిర్వహించిన కంటి పరీక్షల శిబిరంలో రమేష్‌ పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌ రెడ్డి, మంత్రి పొన్నాం ప్రభాకర్‌ ఆదేశాలతో ఈ నెల 1 నుంచి 31వరకు ప్రతీరోజు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. డ్రైవర్లకు కంటి చూపు చాలా ముఖ్యమన్నారు. కొంమంది నిర్లక్ష్యంతో చేసే డ్రైవింగ్‌తో రోడ్డు ప్రమాదాల్లో ఎంతో మంది మృతి చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ట్రాఫిక్‌ రూల్స్‌ పాటిద్దాం.. ప్రమాదాలు నివారిద్దాం అని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అనిత, శీతల్‌, బలరాం, జ్ఞానేశ్వర్‌, అభిలాష్‌, ప్రసాద్‌, వేణు,నాగేశ్వర్‌ రావు, ప్రతీష్‌ రెడ్డి, రాజశేఖర్‌ పాల్గొన్నారు

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి



డైరీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

చైతన్యపురి: రాష్ట్రంలో పెన్షనర్లకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్‌ కరువు భత్యం, ఇతర ఆర్థిక ప్రయోజనాల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తామని ఆల్‌ ఇండియా స్టేట్‌ పెన్షనర్స్‌ అసోసియేషన్‌ సెక్రటరీ జనరల్‌ డి.సుధాకర్‌ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్‌ అసోసియేషన్‌కు చెందిన నూతన డైరీని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని అసోసియేషన్లు ఒకే తాటిపైకి వచ్చి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌.ఉమాదేవి, మారం భరత్‌రెడ్డి, చోలా ఒంప్రకాష్‌ యాదవ్‌ పాల్గొన్నారు.

దశల వారీగా సమస్యలకు పరిష్కారం



జెడ్సీకి సమస్యలను వివరిస్తున్న కార్పొరేటర్‌ పవన్‌కుమార్‌

నాగోలు: కొత్తపేటలో డివిజన్‌లోని సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని జీహెచ్‌ఎంసీ జోనల్‌ కమిషనర్‌ హేమంత్‌ కేశవ్‌ పాటిల్‌ అన్నారు. నాగేశ్వర్‌నగర్‌ కాలనీ, గాయత్రి పురం, శ్రీ రామలింగేశ్వర కాలనీల్లో శనివారం ఆయన సరూర్‌నగర్‌ డిప్యూటీ కమిషనర్‌ సుజాత, కొత్తపేట డివిజన్‌ కార్పొరేటర్‌ పవన్‌కుమార్‌తో కలిసి పర్యటించారు. గాయత్రిపురం నుంచి శ్రీ రామలింగేశ్వర కాలనీ మీదుగా ఉన్న బాక్స్‌ డ్రైనేజీ లైన్‌ సగంలో ఆగిపోయిందని వెంటనే పూర్తి చేసేలా చూడాలని జోనల్‌ కమిషనర్‌కు వివరించారు. గతంలో తెలంగాణ పార్క్‌ అభివృద్ధి పనులను హెచ్‌ఎండీఏ తీసుకుందని పనులన్నీ మధ్యలోనే ఆగిపోయాయన్నారు. కొత్తపేట డివిజన్‌ పరిధిలోని ఎస్‌బీహెచ్‌ కాలనీ, ఆర్బీఐ కాలనీ, భరత్‌నగర్‌, బాలాజీ నగర్‌ కాలనీలో రోడ్లన్నీ ధ్వంసమయ్యాయని వెంటనే నూతన రోడ్లు మంజూరు చేసేలా చూడాలని కమిషనర్‌ దృష్టికి తీసుకొచ్చారు. జెడ్సీ వెంట ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్‌ శ్రీనివాస్‌,డీఈ నవీన్‌ కుమార్‌, శానిటైజేషన్‌ డీఈ చందన, బుచ్చయ్య, ఆర్టికల్చర్‌ సూపర్‌వైజర్‌ ఏఈ సత్యనారాయణ, వివిధ కాలనీ వాసులు సుధాకర్‌, సత్యనారాయణ, విజయ భాస్కర్‌, రాకేష్‌ యాదవ్‌, యాదయ్య, కుమార్‌, నాయకులు పంచ రాజేష్‌ కుమార్‌ నాగేశ్వర్‌, ప్రేమ్‌, విజయ గౌడ్‌ ఉన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లకు సన్మానం

మలక్‌పేట: ప్రమాద రహిత సమాజం కోసం రోడ్డు నిబంధనలు పాటించాలని ఈస్ట్‌జోన్‌ ఆర్టీఓ లెక్కల కిష్టయ్య అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం మలక్‌పేట మూసారంబాగ్‌లోని ఆర్టీఓ కార్యాలయంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్లకు ప్రయాణికుల రవాణా, రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. 33 సంవత్సరాల నుంచి సున్నా ప్రమాద రికార్డు కలిగి ఉన్న మిథాని, కాచిగూడ, దిల్‌సుఖ్‌నగర్‌ డిపోలకు చెందిన ఉత్తమ డ్రైవర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంవీఐలు రమేష్‌ బాబు, రాధిక, నరేంద్ర పాల్‌, బలరామ్‌, ఏఎంవీఐలు జాన్‌, మధుసూదన్‌ రెడ్డి, అశ్వక్‌, ఏఓలు మధుకర్‌, ప్రవీణ్‌, అంజుమ్‌, సిబ్బంది పాల్గొన్నారు.



డ్రైవర్లను సన్మానిస్తున్న లెక్కల కిష్టయ్య